# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 37 సంచిక 6
పేజీలు 44
ఫిబ్రవరి 2018

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


భద్రవాక్యం ....................4
శ్రీబాబూజీ ఉవాచ.................... 6
అమ్మమాట.................... 8
వామనావతారము ....................11
నీ జీవిత నిర్మాతవు నీవే .................... 14
శ్రీ బాలస్వామి ....................16
త్రిపురా రహస్యం .................... 18
అప్పు చేసి ఆపదలో పడకు .................. ....20
సూర్యాష్టకమ్ ....................22
త్యాగ మహిమ .................... ................24
శివుని కథలు .................... ..26
వాసనా త్రయం ....................27
యోగవాశిష్ఠము .................... 29
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................31
పరిప్రశ్న ....................32
శ్రీకృష్ణకర్ణామృతము....................35
వాడల వాడల వెంట ....................37
సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... .................... ....................41

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

**త్రిసుధామసు యత్ భోగ్యం భోక్తా భోగశ్చయద్భవేత్ ।**
**తేభ్యో విలక్షణః సాక్షిచిన్మాత్రో -హం సదాశివః ॥**

(కైవల్యోపనిషత్ 18వ శ్లో॥)

బాహ్య అంతర్గత సమస్త అనుభవాలను ప్రకాశింపజేసేది 'నేనే' అనేది ఆరూఢంగా అనుభవించటమే నిజమైన ధ్యానస్థితి. ఆ స్థితిని చేరటానికి దేహమనో బుద్ధుల నుండి మనలను మనవే మరల్చుకోవాలి. అదే నిజమైన సాధన. ఆ ప్రక్రియ ఫలించినప్పుడే సాక్షీభావం, లేక దేహ విలక్షణత్వం కలుగుతుంది.

దేహేంద్రియాలతో పొందే ఏ అనుభవానికైనా ప్రధానంగా ఆధారము భోక్త, భోగ్యం, భోగం అనే త్రిపుటి మాత్రమే. భోక్త అంటే అనుభవించేవాడు. భోగ్యం అంటే అనుభవించేది. భోగం అంటే అనుభవం. ఏ అనుభవం అయినా జ్ఞానేంద్రియాల ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. అంతేకాకుండా ఈ అనుభవం జాగ్రత, స్వప్న, సుషుప్తి అవస్థలలో దేనిలోనైనా త్రిపుటి లేకుండా సాధ్యం కాదు.

అయితే నేను మాత్రం త్రిపుటికి విలక్షణుడను. కాని ఏ అనుభవానికైనా ఆధారము చైతన్యమే సుమా! మరి సాధన దేనికోసం? సాధకుడు సాధనలో ప్రాపంచిక అనుభవాలన్నింటికి సాక్షిగా, లేక విలక్షణుడిగా వుండగలగటమే సాధన ప్రక్రియలో మొదటి మెట్టు. ఆ ప్రయత్నంలో భాగంగా నిదుర నుంచి మేల్కొనుట అను ప్రక్రియ గాని, మేల్కొన్న వ్యక్తి గాని, మేల్కొన్న తరువాత పొందే విషయజ్ఞానం గాని, తనకి విలక్షణంగా గుర్తించమని గురుదేవులు హెచ్చరిస్తారు. ప్రథమంగా తాను విలక్షణత్వాన్ని గుర్తించాలి. ఆ తరువాత సద్గురుమూర్తి ఆదేశాను సారం సత్యతత్త్వాన్ని గుర్తించాలి. ఆ మరుక్షణం తాను సాక్షిగా గుర్తిస్తున్న విషయాదులు కనుమరుగవుతాయి. ఆ క్షణమే తాను తానుగా మిగిలి పోతాడు. అదే పరాకాష్ఠ.

ఆ స్థితిని చేరటానికి మూడు అవస్థలలోనూ అన్ని అనుభవాలకు సాక్షిగా లేక విలక్షణుడిగా వుండగలగాలి. సృష్టిలో అన్ని కార్యాలు జరగటానికి సూర్య భగవానుని కాంతి కావాలి కదా! కాని సూర్యుడు

ఏ ప్రక్రియలోనూ పాల్గొనడు. అన్ని క్రియాలకు తాను అంటకుండా సాక్షిగా వుంటాడు. అలాగే సృష్టిలో జరిగే అన్ని కార్యాలకు చైతన్యమే ఆధారం అయినా చైతన్యముగాని, పరమాత్మగాని, ఏ కార్యంలోనూ పాత్రధారి కాదుకదా! కేవలం సాక్షి మాత్రమే. ఆ పరబ్రహ్మమే నేను అనేది ఆరూఢమైతే కార్యానికి ఏ భావనకి, ఏ అనుభూతికి, ఏ ఆలోచనకు విషయ ప్రపంచానికి తనకు సంబంధం లేనట్లుగా విలక్షణ స్థితిలో వున్న సాధకుడు తప్పక నేను సాక్షిని, నేను చిద్రూపుడను, నేను సదాశివుడను అనే అనుభూతిని సద్గురుమూర్తి మార్గదర్శకత్వంలో తప్పక సాధించగలడు. మూడు అవస్థలలో అనుభవించేది, అనుభవము, క్రియ అనే త్రిపుటికి సాక్షిగా వుండగలగటమే సాధన ప్రక్రియలో ప్రధానమైనదిగా గుర్తించాలి.

## పెదనింత్రకాలను శాఖలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2018

10 శనివారం - శ్రీ గురుదశమి - రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

13 మంగళవారం - మహాశివరాత్రి - ఉ. 5గం.లకు అభిషేకం; రాత్రి7గం. శ్రీసద్గురు పాదపూజ.

మార్చి 2018

02 శుక్రవారం -పూర్ణిమ (హోలీ),రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

11 ఆదివారం - శ్రీగురుదశమి; రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ.

18 ఆదివారం - శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది, ఉదయం 11 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన వారణాసి అమరేశ్వర శాస్త్రిగారు 12-1-2018 శుక్రవారం నాడు శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 87 సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

2-11-1979

ఈరోజు ఉదయం శ్రీ బాబూజీ వ్యాహ్యాళికి వచ్చినపుడు చరణ్‌దాస్ అనే భక్తుడు శ్రీ బాబూజీని ప్రశ్నించాడు. “భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు చెప్పినట్లు అంత్యకాలంలో భగవంతునియందు మనస్సు నిలిపినట్లయినా లేక భగవన్నామస్మరణ చేసినా జన్మరాహిత్యము పొందవచ్చును కదా? మరి శ్రమపడి సాధన చేయవలసిన అవసరమేమున్నది?”



శ్రీ బాబూజీ సమాధానం చెపుతూ “దాస్ నువ్వు చెప్పింది కరెక్టే. అంత్యకాలమునందు విషయాసక్తి లేని శుద్ధ మనస్సును ఈశ్వరునియందు నిల్పినట్లయితే తప్పక జన్మరాహిత్యము పొందవచ్చు. జన్మరాహిత్యము పొందక పోయినా, మరుసటిజన్మలో వారు తరించుటయే గాక ఇతరులను సహితము తరింపజేసే మహాపురుషుల జన్మమును పొందుతారు. కాని అవసానకాలంలో మనస్సు వికలమై అనేక పూర్వజన్మ వాసనలచేత పీడింపబడి ధనేషణ, దారేషణ, పుత్రేషణలచేత మమత్వాన్ని వదలుకోలేక తిరిగి జనన మరణ పాపపంకిలంలో పడటం సహజము. కాబట్టి సాధన అవసరము.

తల్లిదండ్రులు తమ పిల్లలయందు అత్యంత వాత్సల్యాన్ని కల్గియుండి వారి మంచి చెడ్డలను చూస్తుంటారు. ఇది విడదీయరాని అతి సన్నిహితమైన కర్మబంధము. జగత్తులోని జీవులన్నీ పరమాత్మ సంతతియే యనుట నిస్సంకోచమైనదే కదా! కావున పరమాత్ముడు తన సంతతిని అత్యంత వాత్సల్యంతో చూస్తాడనటంలో సందేహమెందుకు? అయితే జీవులు తమ ఉనికిని భగవంతునికి తెలియజేయాలి. అప్పుడే

భగవంతుని కృపకు పాత్రులౌతారు" అని శ్రీ బాబు చెప్పారు.

కొంచెంసేపు శ్రీ బాబూజీ మౌనంగా ఉన్నారు. ఆయన ఇంకా ఏమి బోధచేస్తారా అని అంతా ఎదురుచూస్తున్నారు.

దాస్ తిరిగి నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ "బాబూ భగవంతునికి మన ఉనికిని తెలియజేస్తే కదా ఆయన కృపకు పాత్రులయ్యేది. మరి మన ఉనికిని ఆయనకు ఎలా తెలియజేయటం?" అని ప్రశ్నించారు.

"మీలో ఎవరైనా ఆ ప్రశ్న వేస్తారేమో అని ఎదురుచూస్తున్నాను" అన్నారు శ్రీ బాబు. శ్రీ బాబు బోధ చేస్తూ "మనస్సు పాదరసము వంటిది. అది నిశ్చలత్వాన్ని పొందటం చాల కష్టము. అనుభవజ్ఞులైన గురుదేవుల నాశ్రయించినవారు తప్పక భగవంతుని కృపకు పాత్రులౌతారు. గురుదేవునికి, భగవంతునికి తేడా లేదు. అంత్యకాలము వరకు వేచియుండక, వర్తమాన కాలములోనే గురుదేవుని ఆశ్రయిస్తే, ఆయన సక్రమమార్గమున నడిపించి తరింపజేస్తారు.

భగవంతుని రూపమునందు మనస్సు నిలిపి భగవన్నామాన్ని స్మరించాలి. మనస్సు భగవంతుని రూపములోనూ, నామములోనూ లయించిపోతుంది. నిశ్చలత్వాన్ని పొందుతుంది. అదే భావ సమాధి. అది నిద్రావస్థ కాదు. భావసమాధి యందుగల రసానుభూతిని పొందినవాడు తప్పక సవికల్ప, నిర్వికల్ప సమాధి స్థితులను పొంది సంప్రజ్ఞస్థితిలో ఆత్మానుభూతిని అనుభవిస్తాడు. వారికి జ్ఞానమునందు కొరత లేదు.

ఇది స్వానుభవమున సంక్రమించిన విద్య. గ్రంథపఠనము ద్వారా సంక్రమించిన విద్య భుక్తికి పనికి వస్తుంది గాని, ముక్తికి పనికిరాదు. కొందరు వేదములు, పురాణములు, ఉపనిషత్తులను గూర్చి అనర్గళంగా ఉపన్యాసాలిస్తారు. అట్టివారు తాము తరించు ఉపాయము తెలియక, తమతోపాటు తమను ఆశ్రయించిన శిష్యులను కూడ గోతిలో పడవేస్తారు. కాబట్టి సహజ జ్ఞాన సంపన్నులైన గురువులను ఆశ్రయించుట ద్వారా మాత్రమే గమ్యస్థానాన్ని చేరుటకు అవకాశము కల్గుతుంది" అని అన్నారు.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## పరశివ స్వరూపుడు శ్రీగురుదేవుడు

"మనం ఎంతో ఆనందంగా ధనుర్మాసం జరుపుకున్నాము. భోగి, సంక్రాంతి పండగల సంబరాలతో, క్రిస్‌మస్, ముక్కోటి ఏకాదశి, త్యాగరాజ స్వామివారి ఆరాధన, ఆంగ్ల నూతన సంవత్సరాది, తదితర పుణ్య తిథులతో, నెల రోజులపాటు తిరుప్పావై, ముకుందమాల, నారాయణ కవచం, ఋషుల చరిత్రలు, సుందరకాండ పారాయణలు, తత్వ విచారణలు, భాగవత శ్రవణము, సత్సంగ సమావేశములతో ఆశ్రమ ప్రాంగణమంతా ప్రతిధ్వనించింది! అహో భాగ్యం! మనదే కదా భాగ్యమంతా. ఈ ధనుర్మాసమంతా మనం ఆ పరమాత్మని కృష్ణ రూపంలో అర్చించుకునే గోపబాలకులు, గోపికలు అయిపోయాము.



ఇక మహాపుణ్య ప్రదమైన ఉత్తరాయణ పుణ్యకాలంలో, మాఘమాసంలో అడుగు పెట్టాము. ఇది సూర్యనారాయణ మూర్తి స్వరూపంలోనూ, శివ స్వరూపంగాను, ఆ పరంధాముని అర్చించుకునే రోజులు.

సూర్య భగవానుడు ప్రత్యక్ష పరమేశ్వరుడు. కర్మసాక్షి. మనం ప్రతినిత్యం ఆదిత్య హృదయం ఈ నెల రోజులూ పారాయణ చేసుకుంటాం. సూర్యుడు ఆరోగ్య ప్రదాత. ఆయన నమస్కార ప్రియుడు. సూర్య నమస్కారాలు కేవలం వ్యాయామం మాత్రమే కాదు. భక్తి శ్రద్ధలతో చేస్తే ఎంతటి జటిలమైన వ్యాధులైనా మటుమాయ మవుతాయి. నేత్ర సంబంధ వ్యాధులు యిత్యాదుల నివారణకి ఆదిత్యహృదయం పారాయణ చేయమనే వారు శ్రీగురుదేవులు. మనకి నిదర్శనాలు కోకొల్లలున్నాయి యిక్కడ.

ఇక సాక్షాత్తు పరమశివుని అర్చించుకునే మహాశివరాత్రి రాబోతోంది. శివుడు భోలా శంకరుడు. ఆయన్ని అర్చించడం, తృప్తి పరచడం కూడా చాలా సులభమేమో అనిపిస్తుంది. మా చిన్నప్పటి నుండి కూడా చిన్న శివలింగం పెట్టుకుని, అభిషేకాలు చేసుకుని, ఒక బెల్లం

ముక్క నైవేద్యం పెట్టేవాళ్ళం. ధ్యాన ముద్రకి కూడా ఈశ్వరుడు చాలా సులభంగా అందేవాడు. చిన్నప్పటి నుండీ అరూపంలో రూపం చూడటం ఇలాగే అలవాటయింది. ఆ తరువాత పెద్దయ్యాక శ్రీగురుదేవులు యాత్రలకి తీసుకువెళ్ళినప్పుడు అనేకానేక రూపాలలో వున్న శివుడిని దర్శించడం జరిగింది. ఏ అభిషేకం చేసినా, పూజలు చేసినా చిత్తశుద్ధి ముఖ్యం.

పరమేశ్వరుడు భోళాశంకరుడని ప్రతీతి. ఎవరు ఆయన గురించి తపస్సులు చేసినా, చివరికి రాక్షసులకి కూడా, ఆయన త్వరగా దర్శనం యిచ్చి, వరాలు యిచ్చేస్తాడు. ఆ వరాల వల్ల వచ్చే చిక్కుల నుండి తప్పించడానికి నారాయణ మూర్తి రావలసినదే. భస్మాసురుడి విషయంలో జరిగింది అదేకదా! తన చెయ్యి ఎవరి తల మీద పెడితే వారు భస్మం అయిపోవాలని వరం కోరుకున్నాడు వాడు. ఈ భోళా శంకరుడు 'తథాస్తు' అన్నాడు. ఆ రాక్షసుడు ఈశ్వరుడిచ్చిన వరాన్ని ఆయన మీదనే ప్రయోగం చేయాలని వెంటబడ్డాడు! ఏ రాక్షసుడు చావాలన్నా మోహం పుట్టాల్సిందే. అందుకనే మోహినీ అవతారంలో వచ్చాడు హరి. ఆయన్ని చూసేసరికి భస్మాసురుడి దృష్టే మారిపోయింది. హరి నాట్యం చేశాడు. - రాక్షసుడు అనుకరిస్తున్నాడు. మోహానికి లోబడ్డవాడు ఏం చేయమన్నా చేస్తాడు. అందులోనూ ఆ వచ్చినది జగన్మోహినీ రూపంలో శ్రీహరి! తనకి వరమిచ్చిన శివుని మీదనే ప్రయోగం చేయాలనుకున్న భస్మాసురుడు తన నెత్తిమీద తానే చెయ్యి పెట్టుకుని తానే భస్మమయి పోయాడు.

ఇక మనకీ మాఘమాసంలో అత్యంత ముఖ్యమైన పర్వదినం మాఘ పూర్ణిమ - శ్రీగురుపూర్ణిమ. గురుభక్తులందరికీ అత్యంత ముఖ్యమైన రోజు.

గడియారంలోని మూడు ముల్లులనూ కదిలించేది, వాటి వెనకాల వుండి కదలకుండా వుండే బ్యాటరీలాగ, స్థూల, సూక్ష్మ, కారణ శరీర త్రయంతో కదిలే మనలని కదిలించే శక్తి మనలోనే వున్న శ్రీగురుపరమాత్మ. కళ్ళు తెరచి చూస్తేనే కోటి జ్యోతులు. కళ్ళు మూసి వుంచితే ఎన్ని జ్యోతులు వుండి ఏం లాభం? అన్నిటినీ చూడటానికి మూలం మనలోపల వున్న ఆ పరంజ్యోతియే. ఒకనాడుమిణుకు మిణుకు

మంటూ వుండేది. కానీ శ్రీగురుదేవులు దానిని ప్రజ్వలించేటట్లు చేసి మనలోనే వున్న ఆ పరంజ్యోతిని దర్శింప జేస్తున్నారు. గురువులు చెప్పింది చెప్పినట్లు చేస్తే చాలు. వారి ఋణం తీర్చుకున్నట్లే. అందుకే న గురోరధికం న గురోరధికం అని శివుడే శాసించాడు. ఆ గురుదేవులే అఖండ జ్యోతి. వారే పరశివ స్వరూపులు. సర్వదేవతా స్వరూపులు. వారే మనకి శివతత్త్వాన్ని ఆరూఢంగా తెలియజేస్తారు.

ఒకే ఒక శక్తి అందరిలోనూ వుండి నడిపిస్తోంది. అది అరూపం. ఆ గురుశక్తి కళ్ళు మూస్తే అరూపం; కళ్ళు తెరిస్తే రూపం. నిజమైన అభిషేకం ఏమిటంటే తైలధారవలే భగవన్నామ స్మరణ చేయటమే అని శ్రీగురు దేవులు శెలవిచ్చారు. మన భావనని బట్టే మనకి అనుభూతి.

అటువంటి పరశివ స్వరూపులైన శ్రీసద్గురుదేవులు అఖండ భక్తి జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి, మనందరినీ రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2018

10 శని - శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

13 మంగ - మహా శివరాత్రి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

మార్చి 2018

01 గురువారం - ఫాల్గుణ పౌర్ణమి; హోలీ సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

11 ఆదివారం- శ్రీగురుదశమి,సాయంత్రం 5 గం॥30నిలకు శ్రీ సద్గురు పాద పూజ. భక్త సమారాధన.

18 ఆదివారం - శ్రీ విలంబి నామ సంవత్సర ఉగాది, సాయంత్రం 5 గం॥30నిలకు శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

# వామనావతారము

- రమణ ప్రసాద్

క్షీరసాగరమథనం అయిన తరువాత అసురగురువులైన భార్గవులు బలిచేత విశ్వజిత్యాగం చేయించారు. ఈ యాగ ప్రభావంవల్ల బలికి ఒక కాంచన రథం, ఉచ్ఛైశ్రవం వంటి కొన్ని గుఱ్ఱాలూ, ఒక సింహధ్వజం, అక్షయతూణీరాలూ, ఒక దివ్య ధనువూ లభించాయి. ఈ లభించినవాటితో ప్రకాశమానుడై దేవేంద్ర నగరాన్ని ముట్టడించాడు. మహేంద్రుడు దేవగురువైన బృహస్పతిని సంప్రదించాడు. ఆయన "బలి మహాతేజశ్శాలి అయిఉన్నాడు. అతడిని ఇప్పుడు జయించటం కష్టం. అతడి తేజం



తగ్గేవరకు స్వర్గాన్ని వదలి పోవటం శ్రేయస్కరమ"ని చెప్పాడు. అది కారణంగా అనాయాసంగా బలికి మహేంద్ర పదవి లభించింది.

అదితి తన కుమారులు తన సవతి బిడ్డలకు భయపడి అదృశ్యులవటం భరించలేక తన పెనిమిటియైన కశ్యప బ్రహ్మను సమీపించి,"మహాత్మా! నీ బిడ్డలందరూ నీకు సములే. అయినా వారిలో దుర్మార్గులను శిక్షించకుండా ఉండటం పాడికాదు. నా బిడ్డలు సర్వ సంపదలను కోల్పోయి అడవులపాలవటం నేను భరించలేకుండా ఉన్నాను. మీరు వారిని కరుణించి నాకు మనశ్శాంతిని కలిగంచండి" అని ప్రార్థించింది. ఆయన ఆమెను "హరిని ప్రార్తిస్తే ఆయన నా ఇష్టార్థాలను తీరుస్తాడ"ని చెప్పగా ఆమె "పయోభక్షణ"మనే వ్రతాన్ని ఆచరించింది. దాని వలన ఆమెకు పీతాంబరధారీ, చతుర్బాహుడూ, శంఖ, చక్ర, గదాద్యాయుధా అలంకృతుడైన విష్ణుమూర్తి ప్రత్యక్షమై, 'నీ గర్భంలో నేను జన్మిస్తాను' అని ఆమెకు ఊరట కలిగించాడు.

కాల క్రమాన అదితి ఒకానొక భాద్రపద శుక్ల ద్వాదశీ శ్రవణ నక్షత్రాన అభిజిన్ముహూర్తంలో ఒక వామనమూర్తిని ప్రసవించింది. శ్రీహరి అవతరణతో తమ బాధలు పోతాయని యక్షులు, మునులు,

సిద్ధులు చింతను పోగొట్టుకున్నారు. అలా అవతరించిన వామనునకు మహర్షులు జాతకర్మాదులు నిర్వర్తించారు. ఉపనయనం చేశారు. అతడిని చూసి అదితి, కశ్యపుడు ఎంతో మురిసిపోసాగారు.

అలా ఉండగా బలి అశ్వమేధయాగం చేస్తున్నాడనీ, అతడిచ్చే దానాలకు అంతులేకుండా ఉన్నదనీ వామనునకు తెలిసి ఆ యాగాన్ని సందర్శించే నిమిత్తం వెళ్ళాడు. సిరులకు తల్లియైన లక్ష్మీదేవి తన ఉరమున నివాసం చేస్తుంటే, శ్రీహరి ఇంద్రుని కొరకు యాచన చేయటానికి బయల్దేరాడు ఆహా! ఎంత వింత!.

ఆ మాయా వటుని తేజం అందరినీ సమ్మోహ పరిచింది. వారందరూ ఆయనకు నమస్కరించగా, బలి చక్రవర్తి ఆయనకు ఉచితాసనాన్ని ఇచ్చి, ఆయన పాదాలు కడిగి, ఆ పాదోదకాన్ని శిరస్సున జల్లుకొని, ఇలా అడిగాడు - 'వడుగా ఎవ్వరివాడవు? నీ నివాసస్థలం ఏది? నీ రాక వల్ల నా వంశం పావనమైంది. ఓ భూసురోత్తమా! నీకేమి కావాలో అడుగు. పట్టువస్త్రాలా? బంగారమా? గోసంపదా? రథాలా? రత్నాలా? మృష్టాన్న భోజనాలా, గృహాలా? రాజ్యాలా? నీకు ఏమి కావాలో అడుగు. ఇస్తాను' అన్నాడు.

వామనుడు,"దానవేంద్రా! 'ఇది' నా చోటని ఎలా చెప్పగలను? నేనన్నిచోట్లా ఉంటాను. నేను ఎవరికి చెందినవాడను కాను. అంటే నాకు చెందిన వాడను నేనే. నేను ముల్లోకాలా సంచరించేవాడను. అన్ని విద్యలను నేర్చిన వాడను. నాకు చుట్టమొక్కడూ లేడు. నేను అద్వితీయుడను. ఒకప్పుడు నాకు 'సిరి' ఉండినది. ఇప్పుడు నా వద్ద లేదు. నేనెప్పుడూ భక్తుల హృదయాలలో నివసిస్తుంటాను. నే నొంటరి వాడను. నాకు ధన సంపదల కాంక్ష లేదు. నాకు మూడడుగుల స్థలం ఇయ్యి. అది చాలు. నేను బ్రహ్మపదాన్ని చేరగలను" అన్నాడు.

గురువైన శుక్రాచార్యుడు(భార్గవుడు) "ఈ పొట్టివాడు సామాన్యుడు కాడు.అంత సులువుగా మూడడుగుల నేలతో పోడు. త్రివిక్రముని వలె బ్రహ్మాండమంతా నిండిపోతాడు. ఈ దానం ఇవ్వవద్దు. ఏదో సాకు చెప్పి పంపించివెయ్యి" అని హెచ్చరించాడు. బలి, "నాకు నరకమే ప్రాప్తించినా, నేను బంధింపబడినా, కులాంతమైనా, ఏది జరిగినా, ఆ వచ్చినవాడు ఎవడైనా, నేను ఇచ్చిన మాటను తప్పను. అయినా అతడు అడిగినంత మేర ఇస్తే నన్నెందుకు బంధిస్తాడు? అంతలో

వింధ్యావళీదేవి బంగారు కలశంతో నీరు తెచ్చింది. వెంటనే,

సురలోక సముద్ధరణము
నిరత శ్రీకరణ మఖిల నిగమాంతాలం
కరణము భవ సంహరణము
హరి చరణము నీటకడిగె నసురోత్తముడున్ ॥

అని ఆ మాయా వటుని దివ్య చరణాలను కడిగిన జలం శిరస్సున జల్లుకున్నాడు. పవిత్రాక్షతలను విడిచి దానం చేశాడు. అప్పుడు ఆయనలో ముల్లోకాలూ, ప్రజాపతులూ, దేవతలూ, సూర్య చంద్రాదులూ,సప్త సముద్రాలూ, కులగిరులూ గోచరించాయి. అన్ని జగాలూ నిండిన జగన్నాథుని చూచి శ్రీమహావిష్ణువే మాయారూపంలో వచ్చి వంచించాడని తెల్సుకుని రాక్షసవీరులు తమ తమ ఆయుధాలు తీసుకొని ముందుకు ఉరికారు. అది చూసి బలి చక్రవర్తి దానవబలం దైవబలానికి వ్యతిరేకంగా ఉన్నదని వారిని వారించాడు.

ఆ తరువాత వామనుడు తన విశ్వరూపాన్ని ఉపసంహరించి, ఒక అడుగుతో భూమ్యాకాశాలూ, రెండవ అడుగుతో స్వర్గలోకం ఛేదించుకొని పైకి ఎగసి, దానవేంద్రా! మూడవ అడుగు ఎక్కడ పెట్టాలో చెప్పి నీ మాటనిలబెట్టుకో! అన్నాడు. 'బ్రాహ్మణోత్తమా! మూడవ అడుగు నా శిరస్సున నిలుపు' అన్నాడు బలి చక్రవర్తి.

ఆ సమయంలో అతని తాత అయిన ప్రహ్లాదుడు అక్కడికి వచ్చి హరికి ప్రణామం చేశాడు. బలి చక్రవర్తి భార్య వింధ్యావళి తనకు పతిభిక్ష పెట్టమని అర్థించింది.

శ్రీహరి "ఈ మహారాజు నిర్మలుడు. ఇతనికి అమరులు సైతం అందుకోలేని విష్ణు పదాన్ని ప్రసాదిస్తున్నాను. సావర్ణిమన్వంతరంలో ఇతడు మహేంద్ర పదవినధిష్టిస్తాడు. విశ్వకర్మ నిర్మితమైన సుతలంలో ఉండి సర్వ భోగాలను అనుభవిస్తాడు. నేనతనికి నిత్య సన్నిహితుడనై, సర్వరక్షకుడనై వ్యవహరిస్తూ ఉంటాను"అన్నాడు.

శ్రీహరి పలుకులకు బలి అమితానందం పొంది,"నీ దయారసం నాపై కురిపించి నాకు ఉన్నత పదాన్ని ఇచ్చావు. ఓ పన్నగ శయనా! నిన్ను నమ్మిన వారికి ఏ ఆపదలూ రావు" అని కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు.

# నీ జీవిత నిర్మాతవు నీవే

- రమణ ప్రసాద్

(శ్రీ మాతాజీవారి ధనుర్మాస ప్రసంగాల నుండి)

"జీవిత పరమార్థాన్ని పొందాలంటే సమర్థులైన గురుమూర్తిని ఆశ్రయించాలి. గురుమూర్తి నీకు లక్ష్యార్థాన్ని ప్రసాదించి నీకు మార్గ దర్శనం చేస్తాడు. కాని నీ సాధన నువ్వే చేయాలి. మన సుకృతం కొద్దీ మనకు సమర్థులైన గురువుల సమాశ్రయం లభించింది. కనుక వారు చెప్పిన మార్గంలో నడుచుకోవాలి. సాధనలో ముందడుగు వేయాలన్నా, నీకు కలిగిన సందేహాలను నివృత్తి చేసికోవాలన్నా ఇక్కడికి రావాల్సిందే. ఎవ్వరూ నిన్ను బొట్టు పెట్టి పిలవరు.

"నాచిన్నతనం గుండుగొలనులో గడిచింది. శ్రీ బాబూజీ మహరాజ్ వారు అక్కడికి వచ్చేవారు. వారి కారు హరన్ వినగానే మాకు తెలిసిపోయేది బాబుగారు వచ్చారని. మేము పరిగెత్తుకుని వారు బస చేసిన చోటుకి చేరుకొనే వాళ్ళం. అక్కడ భక్తులకు వడ్డన జరుగుతుంటే పిల్లలం మేము కూడా వడ్డనకి తయారయ్యేవాళ్ళం. కాని మమ్మల్ని అన్నం, కూరలు వడ్డించమనేవారు. బూరెలు, కాజాలు పెద్దవారే వడ్డించేవారు. నేతి చెంబు అందరికీ ఇవ్వరు. నెయ్యి అంటే గుర్తుకొచ్చింది. మనం బూరెలలో నెయ్యి వేసుకోవటం చూశాం. కాని మా విశ్వనాథం మామయ్య గారెలను నెయ్యిలో ముంచుకుని తినేవాడు. మరి అదేం రుచో? శ్రీబాబూజీ వారు తరచు తమ సంభాషణములలో ఇలా చెప్పేవారు - 'అందమైన భార్య పక్కన ఉండి వేడి వేడి గారెలు నీ పళ్ళెంలో వేస్తే, గారెను సగంగా చేసి ఒక సగం తేనె పాకంలో ముంచి, ఇంకొక సగం అల్లం పచ్చడిలో ముంచి నోటికి అందిస్తుంటే పక్కన ఉన్న నీ భార్య గాని, పిల్లలుగాని గుర్తుకొస్తారా?' అని. కొన్ని సందర్భాలలో, 'నీకు సరిగ్గా తినటంకూడా రాదు ఎలా బ్రతుకుతావయ్యా' అనేవారు. అంటే ఈ బ్రతుకు కాదు. పరమార్థానికి చేరే బ్రతుకు అని అర్థం. ఇంక అక్కడ జరిగే భజనలలో ఈశ్వరమ్మగారు భజన చేస్తుంటే మేము వారికి కనిపించనంత దూరంగా కూర్చునేవాళ్ళం. ఆమె తాళాలు మమ్మల్ని పట్టుకోనిచ్చేది కాదు. మానాన్న గారు కొబ్బరికాయ, హారతి కర్పూరం, సాంబ్రాణి పుల్లలు, పువ్వులు ఇచ్చి ఆమె వద్ద సంగీతం నేర్చుకోవటానికి పంపారు. కాని ఆ సంగీతం - స, ప, స- దగ్గరే ఆగిపోయింది. కాని

కాళక్క తన పెళ్ళయ్యేంతవరకు నాకు చక్కగా నేర్పించింది. ఆమె అత్తవారింటికి వెళ్ళాక భయం భయంగా వెళ్ళి నేర్చుకొనేదాన్ని. నాకు సంగీతం వచ్చేసింది. బాబు దయ! వారి ఇల్లు కూడా భగవన్మయమే. ఎక్కడ భగవంతుని స్పందన మనకి కలిగితే అక్కడే అణువణువునా నిండి ఉన్న భగవత్తత్త్వాన్ని అనుభవిస్తాం.

ఆశ్రమ స్థాపన అయిన తరువాత శ్రీబాబు కొంతమందిని పట్టుకుందామని చూసేవారు. కాని వారు పట్టుబడేవారు కాదు. ఏ అర్ధరాత్రో వచ్చి దర్శనం చేసికొని వెళ్ళిపోయేవారు. 'ఇప్పుడు వచ్చారేమిటి? టైమ్ ఎంతైందో తెలుసా?' అంటే సిటీబస్సులోనో, ఎందులోనో వచ్చామని చెప్పి లోపలికి వెళ్ళేవారు. బాబు తొందరగా వదిలిపెడితే వెళ్ళిపోదామని చూసేవారు. బాబు వదిలి పెడతారా? బాబు కామారపుకోట జీడి కదూ!. మేము బయటనుండి గమనిస్తూండేవాళ్ళం. వీళ్ళు కదిలారా లేదా అని. వీళ్ళకి కొన్ని ఆసనాలు ఉండేవి. మొదట మోకాళ్ళ మీద, తర్వాత ఒంగుని, ఆ పైన నుంచునివుండేవారు. ఎందుకు? బాబు శలవిస్తే వెళ్ళిపోదామని.

శ్రీ బాబు 'పరవాలేదు కూర్చో! అని అమ్మా! ఏమున్నాయి పెట్టడానికిప్పుడు?' అని, 'రామూ! మరే మర్చిపోయా!' అని కబుర్లు మొదలుపెట్టేవారు. వారు తిరిగి చతికిలబడేవారు. బాబుకి వారిని ఎలాగైనా తమ వద్ద కొంతసేపు తమ సన్నిధిలో ఉంచుకోవాలని వుండేది.. వాళ్ళేమో ఎప్పుడు శలవిస్తే వెళ్ళిపోదామని చూసేవారు. ఇలా వుండేది వాళ్ళ ఫ్లైయింగ్ విజిట్; ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలా ఎంతోమందకి ఎన్నో అనుభవాలు ఉన్నాయి. ఇవి ధ్యానానికి ముద్రలు కాక మరేమిటి?

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన యేలూరి రామ్మూర్తి గారు, 14-1-2018 ఆదివారం శ్రీ సద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 75 సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీ బాల స్వామి

- కీ.శే ॥మద్ది నాగేశ్వర రావు

మహాత్ముల జీవితాలలో అనేక అద్భుత సంఘటనలతో అలరారుతూ ఉంటాయి. ఆ సంఘటనలు నిగూఢంగానూ, చాలా విచిత్రంగానూ వుంటాయి. అవి వర్ణించటం కూడా అసాధ్యంగానే వుంటాయి. అలాగే బాలస్వామి జీవితంలో కూడా యిట్టి అద్భుతాలు కోకొల్లలు.

చిన్నతనం నుండీ బాలస్వామి భగవచ్చింతనను ఆహారంగా ఆరగిస్తూ, ఆ చింతన నుండి వెలువడే ఆనంద రసాన్ని పానీయంగానూ సేవిస్తూ వుండేవారు. ఆ వయస్సులోనే వారికి అన్ని మతాలలో గల నిగూఢ అర్థాలను తెలుసుకోవాలనే వుత్సుకత వుండేది. తదనుగుణంగా వారు వైష్ణవ మత సిద్ధాంతాలను తెలుసుకోవాలనే ఆకాంక్షతో, వైష్ణవమత సిద్ధాంతాలకు నిలయమైన దక్షిణాపథంలోని శ్రీరంగ క్షేత్రానికి చేరుకున్నారు.



శ్రీరంగంలో ప్రసిద్ధులైన జియ్యంగారుల వద్ద చేరి వారి దైనందిన కార్య క్రమాల్లో పాల్గొంటూ వైష్ణవ మత సిద్ధాంతార్థాలను గ్రహిస్తున్న వానివలె కనబడేవారు. జియ్యరులు ఆ బాలుని ఎంతో వాత్సల్యంతో చూస్తూ, ఆ పట్టణంలోని ప్రముఖ వైష్ణవ గృహాలకు భిక్షకు పంపించేవారు.

ఒకనాడు ఒక సంపన్న గృహస్థుల యింట బాలస్వామి భిక్ష స్వీకరించటం తటస్థపడింది. పదార్థములన్నీ వడ్డించిన తరువాత బాలస్వామి నివేదన ప్రారంభిస్తూ మందహాసం చేశారు. వారి నవ్వును గమనించిన గృహస్థు, స్వామి భుజించేవరకు మౌనంగా వుండి తరువాత 'స్వామీ! నివేదన ప్రారంభిస్తూ మీరు నవ్వటానికి కారణమేమిటి?'

అని ప్రశ్నించాడు.

స్వామికి చెప్పక తప్పలేదు. "అలక్ష్య భావనతో వండిన క్షీరాన్నాన్నీ చక్కెరపొంగలిని నాకు వడ్డించారు. నివేదన చేస్తుండగా వంటశాలలో ఆ వంటకాలను పిల్లిపాడు చేయటం గ్రహించడం వలన నాకు నవ్వు వచ్చింది" అన్నారు.

ఆ గృహస్థుడు పరమాశ్చర్యంతో వంటశాలకు వెళ్ళి తెలుసుకోగా, వారు కూడా ఆ విషయం నిజమేనని ధృవపరిచారు. అతడు విభ్రాంత చేతస్కుడై స్వామి సన్నిధికి వచ్చి అపరాధాన్ని మన్నించమని వేడుకున్నాడు.

స్వామి పరమానుగ్రహంతో ఆ గృహస్థుని వైపు చూసి, "మీ ప్రారబ్ధ కర్మ బలీయం కావటం చేత, మీ యింట ఒక మూగవాడు, ఒక మూర్ఛలరోగి ఆవిర్భవించారు. ఆ ప్రారబ్ధ కర్మ చాలదేమో అన్నట్లుగా ఈ జన్మలో కూడా మీరు అనేక దుష్కృత్యాలకు ఒడిగడుతున్నారు. వీటి ఫలాన్ని మీరు అనుభవించక తప్పదు" అంటూ తమ నివాసానికి వెళ్ళిపోయారు.

బాలుడు సామాన్యుడు కాదనీ, దైవాంశతో ప్రజర్విల్లుతూ వున్న వాడనీ ఆ గృహస్థు గ్రహించినవాడై, ఆ బాలుని వెతుక్కుంటూ వెళ్ళి, జియ్యరుగారింట వున్న బాలస్వామిని దర్శించి పాదాలకు ప్రణమిల్లాడు.

మహాత్ములకు ప్రేమతో చేసిన సేవలు వృథాకావు. వారు అనుగ్రహ స్వరూపులు కదా! స్వామి ఆ గృహస్థుని యెడల దయకలవారై పిల్లల బాధా నివృత్తికై కొన్ని దీక్షలను చెప్పి, ఆచరించ వలసినదిగా సెలవిచ్చారు.

ఆ గృహస్థుడు అకుంఠిత విశ్వాసంతో ఆ దీక్షలను ఆచరించి తన బిడ్డల రుగ్మతలను పారద్రోలుకున్నాడు. ఆ బిడ్డలు ఆరోగ్యవంతులై, ఆధ్యాత్మిక చింతనాపరులై, సకలైశ్వర్య భోగభాగ్యాలతో తులతూగుతున్నారు.

శ్రీరంగ క్షేత్రంలో అనేక మంది జియ్యరుల సమక్షంలో 'శ్రీ బాలస్వామి'గా బిరుదునంది సన్మానించబడిన బాలుడు ఎవరో కాదు - శ్రీశ్రీశ్రీ సమర్థ సద్గురు హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్' వారే ఆ బాలస్వామి!!

# త్రిపురా రహస్యం

(గత సంచిక తరువాయి)

## జ్ఞాన ఖండం

- రమణ ప్రసాద్

### 15వ అధ్యాయం

శైలోపాఖ్యాన్ని విన్న పరశురాముడు దత్త గురువు చెప్పింది తెలిసికొన్నాడు. దత్తాత్రేయుడు ఇంకా వివరిస్తూ, "నీవు తెలుసుకొన్నదే సత్య స్వరూపం. పరాచితి జగత్తును తనలో ప్రకాశింపజేస్తోంది అనుకోవటం పరోక్షజ్ఞానం మాత్రమే. అది అనుభవానికి వచ్చిన అపరోక్ష జ్ఞానం కాదు. స్వప్నంలో ద్రవ్యనిధి దొరికినా లాభం లేనట్లే, ఈ తటస్థ జ్ఞానం ఉన్నా, లేనట్లే. దీనిని నిరూపించటానికి ఒక వృత్తాంతం వివరిస్తాను - పూర్వం విదేహం అనే దేశంలో జనకుడు అనే రాజు ఉన్నాడు. అతడు ధార్మికుడు, జ్ఞాన వృద్ధుడు. అతడు ఒక యజ్ఞం తలపెట్టాడు. ఆ సమయంలో వరుణుడు కూడా ఒక యజ్ఞం ప్రారంభించాడు.



ఆ యజ్ఞానికి ఎవరూ వెళ్ళకపోవటంతో వరుణుని కుమారుడు అక్కడి బ్రాహ్మణులను తర్కంతో ఓడించి, వారిని తండ్రి తలపెట్టిన యాగానికి తీసుకువెళ్ళాడు. అష్టావక్రుడు వరుణకుమారుని వాదంలో ఓడించాడు. ఆ గర్వంతో బ్రాహ్మణులను అవమానించాడు. వారు ఆ యాగానికి వచ్చిన ఒక తాపసిని ఆశ్రయించారు. ఆ తాపసి అష్టావక్రుని ఈ విధంగా ప్రశ్నించింది, 'దేనిని తెలుసుకుంటే, ఇక తెలియనిది వుండదో ఆతత్త్వం నీకు తెలుసునా?' అని . అష్టావక్రుడు, "ఈ జగత్తుకు మూలకారణము, ఆది మధ్యాంత రహితము అయిన పరమపదము. ఈ పరమ పదాన్ని తెలుసుకుంటే ఇక తెలుసుకోవలసినది ఏదీ లేదు." అన్నాడు. తాపసి," మునిపుత్రా! ఆత్మ స్వయం ప్రకాశము అని విన్నా, దానిని విచారించి తెలుసు కోకుండా, గురువు,''నీవు

స్వయంప్రకాశకుడవు” అని ఎంత బోధించినా, ఈ ఆత్మ విజ్ఞానం అబ్బదు. ఏ విధంగా తన మెడలోని ముత్యాలహారాన్ని చూసుకోకుండా, దొంగలు ఎత్తుకుపోయారని భావిస్తే,‘అది నీ మెడలోనే ఉంది’ అని ఇంకొకడు చెప్తే తెలిసిందో, ఆ విధంగా, గురువు చెప్పినదానిని అంతర్ముఖుడై, తనను తాను పరీక్షించుకోకుండా ఉన్నంతకాలం, తనలో ఉన్న ఆత్మను, అంతటా ఎలా చూడ గలుగుతాడు? అందువల్ల బాహ్యదృష్టి వదలి లోచూపుతో చూడాలి. మునిపుత్రా! ఈ జనకమహారాజు నీకు అది బోధింపగలడు” అన్నది.

-సశేషం



# అప్పు చేసి ఆపదలో పడకు

- గాలి జగదీశ్

మక్రాణా అనే ప్రాంతంలో ఒక ధర్మసత్రంలో భార్యాభర్తలు తమ చిన్న పిల్లవాడితో పాటు బస చేశారు. ఆ సత్రం చాలా పాతబడి వుండటమే కాక, బీటలువారి శిథిలావస్థలో అడవికి దగ్గరలో వుంది. తల్లిదండ్రులు తమ పిల్లవాడిని వరండాలో కూర్చోబెట్టి ఏదో పని మీద బయటకి వెళ్ళారు. వారి పని ముగించుకుని వచ్చి చూస్తే, పిల్లవాడికి ఎదురుగా ఒక పెద్ద నాగుపాము పడగ విప్పి, చుట్టు చుట్టుకుని వుండటం చూసి భయపడి పోయారు. పిల్లవాడేమో గుప్పెటతో మట్టి తీసుకుని ఆ పాము పడగ మీద వేసి కొడుతుంటే, ఆ పామేమో ఎంతో చక్కగా వంగి సహిస్తోంది. తల్లిదండ్రులు హడలిపోయి పెద్దగా కేకలు పెడుతూ 'రక్షించండి! రక్షించండి' .... అని అరుస్తున్నారు.

చుట్టూ జనం పోగయ్యారు. అందులో ఒక గురికాడు వీళ్ళ బాధను గమనించి, పిల్లవాడిని రక్షించడానికి ముందుకొచ్చారు. పిల్లవాడి తల్లిదండ్రుల నుద్దేశించి, "నేను గురి చూసి పామును కొట్టగలను. పాము చచ్చిపోవచ్చు కూడా. అది కూడా మీరు అనుమతిస్తేనే" అన్నాడు. దానికి వారు "అలాగే బాబు. కానీ పిల్లవాడు పాము దగ్గరలోనే వున్నాడు కాబట్టి కాస్త జాగ్రత్తగా చూసి కొట్టు" అని చెప్పారు.

గురికాడు పాముని కొట్టాడు. అది మూర్ఛపోయింది. అది చూసి పాము చచ్చిపోయిందనుకున్నారు అంతా. దాన్ని తీసి ఎక్కడకో విసిరి వేశారు. పిల్లవాడిని తీసుకుని అందరూ ఎవరిదారి వారు వెళ్ళిపోయారు. రాత్రి బాగా పొద్దుపోవటం వల్ల ఆ గురికాడు ఆ సత్రంలోనే ఒక మూల పడుకున్నాడు. రాత్రికి చల్లని వేళలో పాము చైతన్యాన్ని పొంది తిరిగి వచ్చి ఆ గురికాడని కాటువేసింది. వాడు చచ్చిపోయాడు. తెల్లవారే సరికి ఈ వార్త తెలిసి ఆ ఊరి ప్రజలు పాము మంత్రగాణ్ణి పిలిపించారు. వాడు వచ్చి చూసి, "నేను పామును పిలిపించి ఈ విషాన్ని తిరిగి వెనక్కి పీల్చుకునే విద్య నాకు తెలుసు. అదీగాక, ఎవరైనా పదేళ్ళ బాలుడుంటే వాడి శరీరంలోకి పాము ఆత్మను పంపించి మాట్లాడించగలను కూడా" అన్నాడు.

ఆ వయస్సుగల ఒక కుఱ్ఱాడిని పిలిపించారు. అతడిలోకి పాము

ఆత్మను పంపించి ఇలా అడిగాడు మంత్రగాడు "ఆ గురికాడిని ఎందుకు కాటువేశావు?" అని అడిగాడు. దానికి (ఆ కుఱ్ఱాడి లో వున్న ) పాము "నేను నిర్దోషిని. అతనికి నేనేమీ హాని చెయ్యలేదు. వాడు అనవసరంగా నన్ను గురిచూసి కొట్టగా లేనిది, నేను కాటువేస్తే తప్పేమిటి?" అన్నాడు.

మంత్రగాడు "ఆ పిల్లవాడు మీ మీద మట్టి వేస్తుంటే ఏమి చెయ్యలేదెందుకు మరి?" అని అడిగాడు.

"ఆ పిల్లవాడు నాకు మూడు జన్మలకు ముందు అప్పు ఇచ్చాడు. అప్పుడు నేనూ అతనూ ఇద్దరమూ మనుష్యులమే. నేను 300 రూ॥ అప్పు తీసుకుని చెల్లించలేక పోయాను. ఇక ఇప్పుడు ఈ జన్మలో ఇవ్వలేను కూడా. అనుకోకుండా అతను నా ముందుకు వచ్చేసరికి, నేను పడగ వంచి అతన్ని క్షమాపణ కోరుకుంటున్నాను. ఆ పిల్లవాడేమో మట్టితో విసిరి కొడుతూ "సిగ్గు లేదా నీకు? నా అప్పు తీర్చలేదు" అంటున్నాడు. అతని చీదరింపులను సహిస్తూ "నీ అప్పు తీర్చుకుంటాను' అని అతన్ని వేడుకుంటూ వుంటే మధ్యలో ఈ గురికాడు వచ్చి నన్ను అనవసరంగా కొట్టాడు. దానికి నేను బదులు తీర్చుకున్నాను అంతే" అన్నాడు బాలుడు.

మంత్రగాడు పాము ఆత్మతో వున్న బాలునికి నచ్చజెప్పి "సరే కానీ, చెప్పినమాట విని ఇతనిలోని విషాన్ని వెనక్కి పీల్చుకో" అన్నాడు.

బాలుడు (పాము ఆత్మతో వున్నవాడు) "నేను చెప్పేది కూడా విను. మరి నాది వైరము తీర్చుకునే జన్మ. సరే ఆ గురికాడు మొత్తం 900రూ॥లు నాకిస్తే ఇప్పుడే అతని నుండి విషము పీల్చేస్తాను. ఎలాగంటే ఈ పిల్లవాడి దగ్గర తీసుకున్న 300 రూ॥లకి రెండు జన్మల వడ్డీ మొత్తం 900 రూ॥లు చెల్లించాలి నేను" అన్నాడు.

ఆ గుంపులో వున్న ఒక సజ్జనుడు ముందుకు వచ్చి, 900రూ॥ ఆ పసివాని తల్లిదండ్రులకిచ్చాడు. పాము ఆత్మ ఆ బాలుడిలో నుండి పాములోకి వెళ్ళి, ఆ పాము ఆ గురికాడిలోని విషాన్ని పీల్చివేసింది. గురికాడు బ్రతికిపోయాడు.

ఈ కథవల్ల మనకు తెలిసినదేమంటే, వ్యర్థమైన ఖర్చులు చేసి, అప్పులపాలు కాకూడదు. శక్తికి మించిన అప్పులు చేసి, ఋణానుబంధుడు కాకూడదు.

# సూర్యాష్టకమ్

- రమణ ప్రసాద్

1. **ఆదిదేవ నమస్తుభ్యం ప్రసీద మమభాస్కర ।**
   **దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే ॥**

ఆదిదేవా! భాస్కరా! నీకు నమస్కరిస్తున్నాను. అనుగ్రహించు. ఓ దివాకరా! ప్రభాకరా! నీకు నమస్కారము.

2. **సప్తాశ్వ రథమారూఢం ప్రచండం కశ్యపాత్మజం ।**
   **శ్వేత పద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥**

సప్తాశ్వ రథ సమారూఢుడవై, ప్రచండ కాంతితో ప్రకాశించే కశ్యప కుమారా! శ్వేత పద్మమును ధరించిన సూర్యదేవా! నీకు ప్రణామము.

3. **లోహితం రథమారూఢం సర్వ లోక పితామహమ్ ।**
   **మహాపాప హరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥**

ఎఱ్ఱని రథంపై ఎక్కినవాడు, సర్వలోకాలకు పితామహుడు, ఘోరాతి ఘోరమైన పాపాలను కూడా హరించే సూర్యదేవా! నీకు నమస్కారము!

4. **త్రైగుణ్యం చ మహాశూరం బ్రహ్మా విష్ణు మహేశ్వరమ్ ।**
   **మహా పాప హరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥**

త్రిగుణాత్మక స్వరూపుడు, బ్రహ్మవిష్ణు మహేశ స్వరూపుడు, మహాపాపాలన్నీ హరించేవాడు అయిన సూర్యదేవా! నీకు నమస్కారము.

5. **బృంహితం తేజసాం పుంజం వాయుమాకాశ మేవచ ।**
   **ప్రభుం చ సర్వ లోకానాం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥**

సర్వవ్యాపి, తేజోస్వరూపుడు, వాయువాకాశములకు, సర్వలోకాలకు ప్రభువైన ఓ సూర్యదేవా! నీకు నమస్కారము.

6. **బంధూక పుష్ప సంకాశం హార కుండల భూషితమ్ ।**
   **ఏక చక్రధరం దేవం తం సూర్యం ప్రణామామ్యహమ్ ॥**

బంధూక పుష్పము వలె ఎఱ్ఱని రూపము గలవాడు, హార కుండలాలను ధరించినవాడు చక్రధారి అయిన సూర్యదేవా! నీకు నమస్కారము.

7. **విశ్వేశం విశ్వ కర్తారం మహాతేజః ప్రదీపనమ్ ।**
   **మహాపాప హరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥**

విశ్వరూపుడు, ఎల్ల లోకాలను సాధించేవాడు, తేజోరూపుడు, సర్వపాపాలను నివారించేవాడైన ఓ సూర్యదేవా ! నీకు నమస్కారము.

8. **తం సూర్యం జగతాం నాధం జ్ఞానవిజ్ఞాన మోక్షదమ్ ।**
**మహా పాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥**

ఓ జగన్నాధా! జ్ఞాన విజ్ఞాన మోక్షపదమును ప్రసాదించేవాడా! మహాపాపమును హరించే సూర్యదేవా! నీకు నమస్కారము.

**ఫల శృతి -**

**సూర్యాష్టకం పఠేన్నిత్యం గ్రహపీడా ప్రణాశనమ్ ।**
**అపుత్రో లభతే పుత్రం దరిద్రో ధనవాన్ భవేత్ ॥**

ప్రతి నిత్యం సూర్యాష్టకాన్ని పఠించినచో గ్రహపీడ వినాశము, పుత్రులు లేనివారికి పుత్రులు కలుగుతారు. దరిద్రులు ఐశ్వర్యవంతులుగా అవుతారు.

**ఆమిషం మధుపానం చ యః కరోతి రవేర్దినే ।**
**సప్త జన్మ భవేద్రోగీ జన్మ కర్మ దరిద్రతా ॥**

మాంసము, మధుపానము ఆదివారం నాడు ఎవరు చేస్తారో, వారు ఏడు జన్మల వరకూ రోగ గ్రస్థులు, దరిద్రులు అవుతారు.

**స్త్రీ తైల మధు మాంసాని హస్త్యజేత్తు రవేర్దినే ।**
**న వ్యాధీ శోక దారిద్ర్యం సూర్యలోకం స గచ్ఛతి ॥**

స్త్రీ సంగమము, తైలము, మధుమాంస భక్షణ భానువారం నాడు చేయనివాడు సర్వవ్యాధులు, శోకము, దారిద్ర్యము నుండి విముక్తుడై వాడు సూర్యలోకాన్ని జేరుతాడు.

**ఇతి శ్రీ శివ ప్రోక్తం శ్రీ సూర్యాష్టకం సంపూర్ణమ్ ॥**

శివ ప్రోక్తమైన ఈ సూర్యష్టకము సమాప్తము.



# త్యాగ మహిమ

- మురళీ

చక్కవేణుడనే రాజు సద్గుణ సదాచార సంపన్నుడు, ధర్మాత్ముడు, సత్యవాది, స్థిరబుద్ధి, త్యాగి, విరాగి, జ్ఞాని, భక్తుడు. రాజద్రవ్యము దూషితమని భావించి ఆ ద్రవ్యాన్ని తనకుగాని, తన వారికిగాని వుపయోగించుకునేవాడు కాదు. అతడు అభిమానము, మమకారము లేకుండా త్రికరణ శుద్ధిగా రాజ్యకార్యాన్ని చూసుకునేవాడు. అతని రాజ్యం రామరాజ్యం. అందరూ అన్ని విధాలుగా సుఖంగా వున్నారు.

ఆ రాజు తన కోసం తనే స్వంతంగా వ్యవసాయం చేసుకునే వాడు. రాజు, రాణి స్వయంగా పొలంలో పనులు చేసి, పండిన పంటతో పోషణ చేసుకునేవారు. వారు చెరకు, పత్తి, దానిమ్మ, పళ్ళు, కూరలు పండించేవారు. తమ పొలంలో పండిన పత్తితో తయారుచేసిన వస్త్రాన్ని ధరించేవారు. తమ పొలంలో పండిన చెరకుతో బెల్లం తయారుచేసి వాడుకునేవారు. తమ పొలంలో పండిన ధాన్యం, కూరలు, పప్పులు తాముచేసే భోజనానికి వుపయోగించేవారు.

ఆ రాణికి ఏ నగలు ఉండేవి కావు. పండిన ధాన్యం తమ నిత్య అవసరాలకే సరిపోయేవి. రాజు జీవితం సామాన్య రైతు జీవితంలాగే వుండేది. ఆరు గంటలు నిద్రకు వుపయోగించి, మిగిలిన సమయం అంతా భగవద్భక్తి, పరోపకారము, వ్యవసాయము, రాజకార్యములకు వినియోగించేవాడు. అతనికి ప్రాణులన్నింటి పట్ల సమత, దయ, ప్రేమ అనే భావనలు ఒకే రీతిగా వుండేవి. అన్ని ప్రాణులూ పరమాత్మ స్వరూపమని భావించి, నిష్కామ భావనతో అందరినీ, అన్నింటినీ సేవించేవాడు. తనకు చెందిన పనులు సేవకులతో చేయించకుండా తానే స్వయంగా చేసుకునేవాడు. అతడు ఏ పని చేసినా అహంకారం లేకుండా చేసేవాడు.

ఒకసారి చక్కవేణరాజు ఉన్న దేశంలో పెద్ద జాతర జరిగింది. ఆ నగరానికి ఇతర ప్రాంతలకు చెందిన ప్రజలు చాలా ఎక్కువ సంఖ్యలో వచ్చారు. వారిలో చాలామంది రాజును, రాణిని దర్శించటానికి వచ్చారు. ఒకరోజు చాలా విలువైన నగలు, వస్త్రాలు ధరించి, అనేకమంది దాస దాసీ జనులు చుట్టూ నడుస్తూ వుండగా ధనిక వ్యాపారుల భార్యలు

రాణిని దర్శించటానికి వచ్చారు. వాళ్ళు రాణిని చూస్తునే "రాణీగారూ! మీరు ధరించే వస్త్రాల్లాంటివి మా పనివాళ్ళు కూడా కట్టుకోరు. మా దాసీలను చూడండి ఎలాంటి వస్త్రాలు ధరించారో, నగలు పెట్టుకున్నారో. మీ వస్త్రాలు, నగలు మేము ధరించే వాటికంటే మించినవై వుండాలి. మాకు ఈ దాసీజనమెలాగో, మీకు మేము దాసీజనంలాంటి వాళ్ళము. మీరు మాకు యజమానులు. ఒక మహారాజు యొక్క మహారాణిగా తగిన వస్త్రాభరణాలతో మేము మిమ్మల్ని చూడాలనుకుంటున్నాము. మీ నాధుడు మహారాజు. మీరు ఆయనకు కొంచెం సూచన ఇచ్చినా వారు మీకోసం మాకంటే కూడా అధికమైన వస్త్రాలను, నగలను సమకూర్చగలరు" అని వెళ్ళిపోయారు. వారి మాటల ప్రభావం రాణిగారి మనస్సు మీద  బాగా పడింది.

మహారాజు వచ్చినప్పుడు సంఘటననంతా ఆయనకు వినిపించి, ఆ ధనిక వ్యాపారస్థుల భార్యలు అన్న మాటలను తెలియజేసింది. తాను ధరించటానికి విలువైన నగలు బట్టలు తీసుకురమ్మనమని కోరింది. రాజు "ఎలా తేగలను? వినియోగించటం కాదు కదా, కనీసం రాజ్య ధనాన్ని తాకను కూడా తాకలేను. దానితో బుద్ధి నశిస్తుంది" అని పలికాడు. రాణి కూడా ఉన్నత స్థాయికి చెందిన సంస్కారం గల పవిత్రమైన స్త్రీ. కానీ ధనిక స్త్రీల మాటల ప్రభావం ఆమెపై బాగా పడింది. "స్వామీ! మీరు మహారాజులు. నేను మీ పట్టపురాణిని కదా! తగిన విలువైన నగలను, బట్టలను ఏర్పరచే కృప మీరు చేయవలసినదే" అన్నది రాణి.

రాణీ మాటలకు ప్రేరితుడైన రాజు ఆలోచించాడు. "రాణి ఎంత పట్టుబట్టినా నేను రాజ్య ద్రవ్యాన్ని మాత్రం వాడుకోలేను. కానీ రాజును కనుక దుష్టులు, దురాచారపరులైన రాజుల నుండి ధనాన్ని తీసుకొనగలను' అని ఆలోచించాడు.

వెంటనే ఒక మంత్రిని పిలిచి మీరు రాక్షసరాజు రావణుని వద్దకు వెళ్ళి, 'నేను రాజు చక్రవేణ మహారాజు దగ్గర నుండి వచ్చాను. పన్ను రూపంలో మీ నుండి మణుగు బంగారాన్ని తీసుకు రమ్మనమని  మా మహారాజు పంపించారు'  అని చెప్పి మణుగు బంగారం తీసుకు రండి అని చెప్పిపంపించాడు.

-సశేషం

# శివుని కథలు

- రమణ ప్రసాద్

## చంద్ర శేఖరుడు

"అభయహస్తంతో, వరదముద్రతో, ధవళ కాంతులతో, శిరమున చంద్రుడు ప్రకాశించుచుండగా స్థిరాసన స్థితుడై ఉన్న చంద్రశేఖరుడు నా హృదయపద్మమున నెలకొని ఉండుగాక!"

చంద్ర శేఖరుడు అంటే శిరస్సున చంద్రుని ధరించిన భోగమూర్తి అని అర్థం. ధక్షుడికి 27 గురు నక్షత్రాల పేర్లు గల కుమార్తెలు ఉన్నారు. వారందరూ చంద్రుని వివాహంచేసికొన్నారు. కాని చంద్రునికి వారందరిలో రోహిణిపైన వ్యామోహం ఎక్కువ. మిగిలిన కుమార్తెలందరూ తమ తండ్రి అయిన దక్షుడి వద్దకు వెళ్ళి, ' మా భర్త మమ్మల్ని సరిగ్గా చూసుకోవటం లేద'ని ఆరోపణ చేశారు.

దక్షుడికి కోపం వచ్చి,' రోజు రోజుకి నీ కళలు క్షీణించి పోతాయి' అని శపించాడు. 16 కళలలో ప్రతిరోజు ఒక కళ క్షీణించిపోతోంది. చంద్రుడు భయంతో, అవమానంతో సముద్రంలోకి వెళ్ళి దాగాడు. చంద్ర కాంతితో పెరిగే చెట్లు, ఓషధి మొక్కలకు ముప్పు వాటిల్లింది.. చంద్రకాంతి లేకపోవటంతో లోకాలన్నీ అల్లకల్లోలం అయ్యాయి. దేవతలందరూ చంద్రుని వద్దకు వెళ్ళి దేవాది దేవుడైన పరమ శివుని శరణు కోరమని సలహా ఇచ్చారు. అప్పటికి ఒక కళే మిగిలిఉన్న చంద్రుడు శివుని శరణు జొచ్చాడు. పరమ దయాళువైన శివుడు చంద్రుని తన శిరస్సుపైన ధరించి 15 రోజులు దిన దిన వర్ధమానం అయే కళలతోను, 15 రోజులు దిన దినము క్షీణించే కళలతోను ఉండమని దీవించాడు.



అందువలన శివుడు చంద్ర శేఖరుడుగా, శరణాగతత్రాణుడుగా పేరు గాంచాడు.

# వాసనాత్రయం

-పరాశర ప్రసాద్

తాను కాని దేహం తాను అనుకోవటమే అజ్ఞానం. తనను తాను గుర్తించటమే జ్ఞానము. దీనినే ఎరుక అంటారు. అయితే మానవుడు కోరుకునే శాశ్వతానంద సుఖము, లేక బ్రహ్మానందానికి వాసనాత్రయం ప్రతిబంధకము. లోకవాసన, శాస్త్రవాసన దేహవాసన అనేవి వాసనాత్రయం.

లోకవాసన శాస్త్రవాసన అనేవి తూలాజ్ఞానం. అవి ప్రాపంచికమైనవి. వాటిని తొలగించుకోవటం సులభమే కావచ్చు కాని దేహవాసన మాత్రం మూలా జ్ఞానం. అది మూలమైనది. దానిని తొలగించుకోవటం అంత సులభం కాదు. ఒక మహావృక్షం కొమ్మలు ఎన్ని పర్యాయాలు తొలగించినా అవి ఎలా తిరిగి అంకురిస్తాయో దేహవాసన కూడా ఎన్ని ప్రయత్నాలు చేసినా నిర్మూలించటం అసంభవం. వృక్షానికి మూలమైన వేరుని తొలగిస్తే ఆ వృక్షం ఎలా నిర్మూలింపబడుతుందో దేహవాసనకి మూలాన్ని వెదకాలి.

లోకవాసన అంటే మానవుడు లోకంలో అందరూ పొగడ్తలతో ముంచెత్తాలని, తనని ఎవరూ ఏ పరిస్థితులలోనూ నిందించకూడదని భావించటం, ఉన్నత పదవులు ఆశించటం, అందరిలోనూ తాను భావించినట్లే చెల్లుబాటు కావాలనుకోవటం లోకవాసనకి తార్కాణం. లోకమే అశాశ్వతమని నిందాస్తుతుల వలన తనకు కలిగే లాభనష్టాలేమీ లేవని గురుమూర్తి ప్రబోధం వలన గ్రహించిన సాధకుడు లోకవాసనని అధిగమించ గలుగుతాడు.

శాస్త్రవాసన అంటే శాస్త్రజ్ఞానాపేక్ష కలగటం దానివల్ల వచ్చిన నష్టమేమీ లేదు. అయితే శాస్త్ర జ్ఞానం వల్ల పలువురితో వాదప్రతివాదనలు చేసే అవకాశం కలుగుతుంది. అంతేకాదు, వాద ప్రతివాదనలలో ఓడితే దుఃఖం, గెలిస్తే ఆనందం సహజమే కదా! అవి సాధనకు ప్రతిబంధకము. తాను భావించినదే యదార్థమని కొన్ని సందర్భాలలో సద్గురుమూర్తి బోధని సహితము శంకించే అవకాశము ఉంది. సద్గురుమూర్తి బోధని, ఆధ్యాత్మిక ప్రామాణిక గ్రంథాలతో అన్వయించుకున్న సాధకునికి శాస్త్ర వాసన రహితం కావటం తథ్యం.

దేహవాసన మూలా జ్ఞానము. జీవించి వుండటానికి దేహము కావాలి కదా. అందువలన దేహము దీర్ఘ కాలము వుండాలని, సుందరంగా వుండాలని దానికి తగిన ప్రయత్నమే దేహవాసన. అంతేకాదు దేహసంబంధమైన అవయవాలను, బంధువులను, మిత్రులను నావారు, నావి,

నా కులం, నా గోత్రం, నా దేశం అనేవి కూడా దేహవాసనే సుమా!

దేహానికి కారణం కర్మము. కర్మ రహితము కానంతవరకు దేహము తప్పదు కదా. ఆ తత్త్వమును అవగాహన చేసుకుని దేహము నందు నిరపేక్ష భావన కలిగి వుండటానికి చేసే ప్రయత్నము ద్వారా దేహభావన రహితమవుతుంది. దేహభావన వలన ధనకాంక్ష, భార్యా బిడ్డల యందు అనురక్తి, బిడ్డల యందు మమకారము కలుగుతాయి. అవే ధనేషణ, దారేషణ, పుత్రేషణ. కాబట్టి దేహవాసన చాలా లోతైనది. అది రహితంకావాలంటే సమర్థులైన గురుమూర్తి సమాశ్రయం ద్వారానే సాధ్యపడుతుంది. అన్యథా సాధ్యం కాదు. ఏదైనా ధీర్ఘకాలం ఆవాసం చేస్తే ఆ గృహం నీది కాకపోయినా అభిమానం కలుగుతుంది. అలాగే దేహం మీద అభిమానమే దేహవాసన. దేహం నేను అనే భావనే జీవత్వం. అది నశించే వరకు ముక్తిని పొంద లేరు. మనస్సు ద్వారా పొందిన ప్రతిబింబమే చిదాభాసుడు లేక జీవుడు. తాను కాని దేహాన్ని తానుగా భావన చేయటమే దేహ భావన. దానినే అధ్యాస అనవచ్చు.

సద్గురు మూర్తి బోధాశ్రవణం చేసి, విచారణ ద్వారా దేహవాసన రహితం కావాలిగాని వేరొక మార్గం లేదని సాధకులు గ్రహించాలి.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జనవరి 2018, ఫిబ్రవరి 2018, మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి

జనవరి 2018: AS 5440, 5441, 5443, 5445, 5446, 6486, 6624, 6626, 6633,
AS 6812, 6824,6990, 6992, 7160, 7173, 7207, 7210, 7273,
AS7207, 7210, 72737419, 7421-7426, 7432, 7434-7436,
AS 7439, 7440, 7441, LM 4106

ఫిబ్రవరి 2018: AS 4473, 6152, 6280, 6421, 7220, 7224, 7225, 7226, 7234,
AS 7236, 7277, 7443, 7444, 7445, 7448, LM 4108

– మేనేజర్

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

"ఆమె అప్పుడొక పూల పాన్పుపై కూర్చొంది, సామవేద గీతాలను, మధురమైన స్వరముతో వుచ్ఛరించింది, అప్పడు రాజుగారా పాటలు వినగానే, అతని మేధస్సు, వొక అద్భుతమైన ఆనందానుభూతికిలోనై, అతని నిద్రాణమైన జీవితము, సూర్యకాంతిని చూడగానే మొగ్గయైన పద్మము వికసించినట్లు, వికసించింది నెమ్మదిగా అతను కనురెప్పలు తెరిచాడు, రాజుగారి దేహము మొత్తము నూతన జీవంతో వుత్తేజ పూరితమైనది.



తన ముందు కుంభమునిని చూచి, ఆయన నీవిధంగా స్తుతించాడు, "స్వామీ, మీ కృప వలన నేను నిర్వికల్ప సమాధిలోని, దివ్యానందమునమనుభవించాను. నేను జనన, మరణములనే కష్టవలయము నుండి విముక్తి పొందాను. సమాధిలో పొందిన దివ్యానందముతో పోలిస్తే, స్వర్గ సుఖములు కేవలము తుచ్ఛ మనిపించింది"

కుంభముని యిలా ప్రశ్నించాడు. 'ఓ రాజా! మీకిప్పడన్ని బాధలు, సందేహాలు, బ్రహ్మానందమును పూర్తిగా చవిచూశారా? మీరిప్పడు విషయాసక్తమైన వస్తువుల పట్ల ఆకర్షణ, విముఖత లేకుండా వున్నారా? మీరు సమత్వ దృష్టి, సమరహిత దృష్టి పెంపొందించుకొన్నారా? మీరు యీ భువిలో వుండే విషయ సుఖాలపట్ల వుండే ఆసక్తిని పూర్తిగా నిర్మూలం చేసుకొన్నారా?"

శిఖిధ్వజుడిలా సమాధానము చెప్పాడు 'ఓ పూజ్యగురుదేవా! మీకృప వలన నేను అన్ని రకాల బాధలు, సందేహాలు, ప్రేమ, ద్వేషము, భ్రమల నుండి విముక్తి పొందాను. నేను వినాశము, మరణము, వ్యాధుల నుండి స్వేచ్ఛ పొందాను. ఏది సాధించాలో, దానిని సాధించాను, నేను నాలో చాలా సంతృప్తిగా వున్నాను, నేనిప్పడమోఘమయిన సంతృప్తి ననుభవిస్తున్నాను. నాకిక తెలుసుకోవలసినది, తెలియనిదంటూ

యేమిలేదు. నేనిక పొందనిది, పొందవలసినదంటూ యేమిలేదు, నేనిక కోరుకోవలసినది, చూడవలసినది, వినవలసినదంటూ యేమిలేదు. నా ఆత్మ వికాసమునకు నేనిక యెవరి వద్ద నుండి, యెలాంటి సలహాలు తీసుకోవలసిన ఆవశ్యకతలేదు. నాకు సమత, సమహిత దృష్టి, దృక్పధము లభించింది".

తరువాత కుంభముని, శిఖిధ్వజుడు యిద్దరు కలిసి ఆనందముగా అడవుల్లో, పర్వతాల పై విహరించారు, వారెన్నో సరస్సులను, నదులను చూశారు, ఒక రోజు కుంభముని రాజుగారితో యిలా అన్నాడు "ఈ రోజు దేవలోకానికి వొక గొప్ప పర్వదినము. ఆ సమావేశములో నేను, నారదుని ముందుకు వెళ్లాలి, నా నిష్క్రమణ విధిచే నిర్ణయింపబడ్డది, దానిని తప్పించటానికి యేవిధంగా కూడ సాధ్యముకాదు. న్యాయము నెదిరించటానికెవరికీ సాధ్యముకాదు, న్యాయమునకెవరూ యెదురీదలేరు, నేను తప్పకుండా, సూర్యాస్తమయ సమయానికి తిరిగి వస్తాను. అతను రాజుగారికి పుష్ప గుచ్ఛాన్ని యిచ్చి, తాను నిష్క్రమించాడు.

కుంభముని మరల చూడాల రూపాన్ని ధరించి ఆకాశ యానము చేసి, తన నగరమునకు వెళ్లి, అక్కడ రాచకార్యములను నిర్వర్తించింది. మరల కుంభముని రూపం దాల్చి, గాలిలో పయనించి, శిఖిధ్వజుని నివాసము ముందు వాలింది. శిఖిధ్వజుడిలా అన్నాడు, 'ఓ మునివర్యా, మీరు మహర్షి కదా! మీరీ రోజు యెందుకు విచారంగా వున్నారు?"

కుంభముని సమాధానం చెప్పాడు, "ఎలాంటి విషమ పరిస్థితులలో కూడ చలించకుండా, సహనంగా వుండేవారే సత్యాన్ని గ్రహించినవారు. లేని వారు మోసకారులే. మనకు శరీరాలు వున్నంత వరకు, శరీరావయవములను సక్రమ పద్ధతిలో పనిచేయించాలి, సృష్టికర్త బ్రహ్మ, మిగిలిన దేవుళ్ళు కూడ భౌతిక శారీరక ఆవశ్యకతల నంగీకరించవలసినదే, ఏ వొక్కరూ కూడ భగవన్నిర్దేశితమైన న్యాయానికి యెదురీదలేరు. విధి యొక్క ప్రభావమునెదిరించే శక్తి యేఒక్కరికీ లేదు, నదులలోని నీరెలా సముద్రములో కలుస్తుందో, అలాగే విధి అన్ని వస్తువులనూ, తాను నిర్దేశించిన మార్గములో చరించేట్లు చేస్తుంది."

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**ఫిబ్రవరి 2018**

10 శని - శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

13 మంగ - మహా శివరాత్రి - తె॥జా 3గం.లకు బృందావనంలో శ్రీగురుదేవులకు నమకచమక సహిత అభిషేకం; 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ; అనంతరం శ్రీరామలింగేశ్వర స్వామికి సామూహిక ఏకాదశ రుద్రాభిషేకాలు; 11గం.లకు శ్రీరామలింగేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం; లక్షబిల్వార్చన; భక్తసమారాధన. సాయంత్రం 6-30ని॥లకు శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి సామూహిక కళ్యాణ మహోత్సవం; అనంతరం స్వామివారి నగరోత్సవం.

15 గురు అమావాస్య

18 ఆది : ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి ఆరాధన, సత్సంగం; శ్రీ సద్గురు పాద పూజ

20 మంగ - ఫాల్గుణ శుద్ధ పంచమి -శ్రీ విజయేశ్వరానంద స్వామివారి ఆరాధన - 18 నుండి 20 వరకు సత్సంగ కార్యక్రమములు

**మార్చి 2018**

01 గురు - హోలీ, శ్రీ సద్గురు పాద పూజ.

11 ఆది - శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

15 గురు - మాస శివ రాత్రి, పావులూరు శాఖలో ఏకాహం.

17 శని - అమావాస్య.

18 ఆది - శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది; ఉదయం 11గం.లకు పంచాంగ శ్రవణం; శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

18 ఆదివారం నుండి 24శనివారం వరకు మౌన ధ్యాన సప్తాహ శిబిరం.

25 ఆది- శ్రీరామనవమి - ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, 11గం.లకు శ్రీసీతారాముల సామూహిక కళ్యాణాలు, భక్తసమారాధన.

31 శని - పూర్ణిమ,శ్రీ సద్గురు పాద పూజ

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

ఆధ్యాత్మిక విద్యకు అధికారి ఎవరు? ఎంత రుచికరమైన వంటకాలు వున్నా, ఆకలివేస్తేనే కదా వాటిని స్వీకరించగలిగేది. అలాగే వైద్యుడిని ఆశ్రయించేవాడు ఏదో వ్యాధిగ్రస్థుడై వుండాలి. కనీసం ఏదో ఒక శారీరక సంబంధమైన బాధ వుంటేనే వాడు వైద్యుడిని సంప్రదించే అవసరం కలుగుతుంది.

అలాగే ఏదైనా వుద్యోగాన్ని పొందాలన్నా, ఏదైనా వృత్తిని చేపట్టాలన్నా దానిని చేపట్టటానికి కనీస అర్హతలు వుండాలి కదా! అలాగే ఆధ్యాత్మిక విద్యని అభ్యసించటానికి ఏ అర్హతలు వుండవా! అది అందరికీ సాధ్యమేనా?



ముందుగా దానిని అభ్యసించే వ్యక్తికి దాని మీద ఆసక్తి వుండాలి. ఏ కార్యం తలపెట్టినా దానికి కారణం వుంటుంది కదా. అంతేకాదు మానవుడు ఏ కార్యం తలపెట్టినా ప్రతిఫలాపేక్షతో ఆ కార్యాన్ని నిర్వహిస్తాడు, సాధిస్తాడు. అలాగే ఆధ్యాత్మిక విద్యని అభ్యసించ డానికి తగిన కారణం వుండాలి కదా!

మానవ జన్మకు వచ్చిన ధ్యేయం ఏమిటో తెలుసుకోవాలి కదా! కేవలం ప్రాపంచిక విషయాదులు అనుభవించటానికే కాదుకదా! వచ్చిన జన్మని సార్థకం చేసుకోవాలి. జన్మించిన ప్రతి వ్యక్తి దేహాన్ని వదలి పెట్టక తప్పదు కదా! మరణం అంటే ఎవరికైనా భయమేకదా! జన్మించిన తరువాత మరణం తప్పదు. అయితే జన్మ లేకుండా చేసుకో గలిగే ఆ వుపాయాన్ని వెదకాలి. దాని గురించి లోతుగా విచారణ చేయాలి.

మరణ భయం కలిగిన మరుక్షణం ప్రతి వ్యక్తి దైవాన్ని ఆశ్రయిస్తాడు. ముందుగా దైవ సందర్శన, పూజ, సంకీర్తనలలో పాల్గొనటం అలవాటు చేసుకుంటాడు. దాని ద్వారా భగవదనుగ్రహం చేత సద్గురుమూర్తి సందర్శనం కలుగుతుంది. ఆయన బోధా శ్రవణం ద్వారా ఆధ్యాత్మిక విద్యను అభ్యసించాలనే ఆసక్తి కలుగుతుంది. ఆసక్తి కలిగినంత మాత్రాన అధికారి అవుతాడా?

ఆధ్యాత్మిక విద్యకి అధికారి అవ్వాలంటే సాధనా చతుష్టయ

సంపత్తి చేకూర్చుకోవాలని వివేకచూడామణి స్పష్టంగా తెలియ జేస్తోంది. అయితే సద్గురుమూర్తి బోధాశ్రవణం ద్వారా సాధకునికి తన జీవిత ధ్యేయం సాధించాలనే ఆవేదన అనురక్తి కలుగుతుంది. అదే శుభేచ్ఛ. శుభేచ్ఛ ద్వారా విచారణ చేస్తాడు.

మానవ జన్మ ఉద్దేశ్యమేమిటి? జనన మరణ విషవలయం నుండి తప్పించుకునే మార్గం లేదా? దానిని ఎలా సాధించాలి? అనే విచారణ చేసి, సద్గురుమూర్తిని ఆశ్రయిస్తాడు. సద్గురుమూర్తి సమాశ్రయం ద్వారా వివేకవంతమైన విచారణ చేసి వివేకము, వైరాగ్యం, ఇంద్రియ సంయమనము సాధించగలుగుతాడు. దానిని సాధించిన ముముక్షువే అధికారి. గురులక్ష్యార్థాన్ని స్వీకరించటం ద్వారా గురు పుత్రుడే అవుతాడు. గురుమూర్తి అనుగ్రహానికి పాత్రుడైన సాధకుడే అధికారి, లేక గురుబిడ్డ.

సద్గురుదేవులు ప్రబోధన చేస్తూ "గురుబిడ్డ అయిన సాధకుడు కృతార్థుడు. జనన మరణ విషవలయం నుండి రక్షింపబడిన వాడు" అనేవారు. అయితే గురుబిడ్డ, లేక అధికారి అయిన సాధకుడు తాను ఆశ్రయించిన గురుమూర్తి అందించిన పదములను మనస్సులో పదిలపరచుకుని, విచారణ చేయాలి. మననం చేయాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. అనుభవించాలి. సాధకుడు వేసే ప్రతి అడుగు ఆలోచించి వేయాలి. దీనిని పొందటానికి సద్గురుమూర్తిని ఆశ్రయించాలి. అనుసరించాలి. విశ్వసించాలి.

**- లోకంలో నువ్వు ద్వేషించినా, ప్రేమించేది అమ్మ మాత్రమే!**

**- ఓర్పు ఎంత చేదుగా వుంటుందో, దాని ఫలితం అంత తియ్యగా వుంటుంది.**

**- మంచికి మించిన దైవము లేదు, చెడుకు మించిన దయ్యం లేదు.**

**- మనిషికి విజ్ఞత కన్నా మించిన మిత్రుడు లేదు.**

**- మన జననం సాధారణమైనదే కాని, మన మరణం ఒక చరిత్రను సృష్టించేదిగా వుండాలి.**

-బి. భారతీదేవి

## శుభాభినందనలతో ...


**Grand**

**R A D I A T O R S**

**AN ISO 9001:2008 CERTIFIED COMPANY**

Manufactures of Radiators (Automobile and Industrial), Oil Coolers, Air Coolers, After Coolers, Inter Coolers, Finned Tube Coolers, Shell and Tube Heat Exchngers,Tube Bundles,Condernsers,Cooling Coils,All Pre-Heaters, Large After Coolers and Mechanically Bonded Radiators









# GRAND RADIATORS

PLOT NO 131, BLOCK – D, AUTONAGAR,

VISAKHAPATNM -530012.AP, INDIA

TELPHONE: 0891-2517706, 2564538, FAX NO. 0891-2513660, 2502640

E-mail: grandradiator@yahoo.in Website: www.grandradiators.com

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**ద్వితీయా శ్వాసము 90వ శ్లో॥**

**సరస గుణ నిలయం। సచ్చిదానంద నాయకమ్।**
**శమిత సకల మాయం సత్యలక్ష్మీ సహాయమ్।**
**శమదమ సముదాయం। శాన్త సర్వాన్త రాయమ్।**
**సుహృద జనదాయం। నౌమి గోపాల బాలమ్॥**

తాత్పర్యము -

మేలైన గుణముల ప్రోగు గలవాడును, సచ్చిదానంద రూపుడును, అణగించబడిన మెలకువ కుచ్ఛితములు గలవాడు, సూన్యత సంపదతో కూడినవాడును, బహిరంతర నిగ్రహము కలవాడును, శమింపజేయబడిన యెల్ల విఘ్నములు గలవాడు, శుద్ధమైన చిత్తము గలవారి భాగ్యమగు గోపరేడగు శ్రీకృష్ణుని గురించి మ్రొక్కెదను.



'మాలతీ, చూడమ్మా! మా లలిత అస్తమానం ఆ కృష్ణుడినే కలవరిస్తోంది. కాస్త దాని మనస్సుని మార్చటానికి ప్రయత్నించగలవా?'

'పెద్దమ్మా! అదేమన్నా చిన్నపిల్లా? మార్చటానికి నేను ప్రయత్నిస్తాను.' వాళ్ళిద్దరూ యమునానదికి నీళ్ళకని బయలు దేరుతూ దారిలో బృందావనంలో అడుగు పెట్టగానే మాలతి మనస్సు కలవరం అయిపోయింది. తెలియని భయమేదో పట్టుకుంది. లలితకు నేను ఏం చెప్పగలను? ధైర్యం లేకపోయింది. 'సరే' అని మొదలు పెట్టింది.

'ఆ కృష్ణుడు ఉన్నాడు చూడు లలితా!' అనగానే, 'అవునా, మేలైన గుణాలు కలవాడు, ఆ పైన సచ్చిదానంద స్వరూపుడు' అన్నది లలిత. వెంటనే మాలతి 'అది కాదే లలితా! ముందు నేను చెప్పేది విను' అన్నది. 'ఇంకేం చెప్పాలి? కృష్ణుని గురించి చెప్పాలంటే నా మనస్సంతా పొంగి పోతుంది. వాడు మాయనంతా అణచివేస్తాడు. సత్యం అనే లక్ష్మీపతి వాడు. అంతరేంద్రియ, బాహ్యేంద్రియ నిగ్రహం కలవాడు. ఆపైన విఘ్నాలన్నీ తొలగించివేస్తాడు. శుద్ధమైన మనస్సుగలవాని సొమ్మువాడు. గోపరేడు అయిన కృష్ణునికి నమస్కరిస్తున్నాను" అన్నది లలిత. ఆ మాటలు విన్నతరువాత మాలతి ఇంకేం మాట్లాడలేక పోయింది. మాలతి మనస్సు కూడా కృష్ణునియందే లగ్నమయిపోయింది. ఇద్దరూ శ్రీకృష్ణుని లీలలే చెప్పుకోసాగారు. లలిత అత్తగారు తెల్లమొహం వేసింది!!

శుభాభినందనలతో ...



INDIGENEOUS anadig MAKE
CAKT-02, CAKT-05, CAKT-06 & TAK-011-03
ENGINE ROOM INSTRUMENTATION FOR EKM SUBMARINE
INDIGENOUS INSTRUMENTS FITTED ON
• INS SINDHUKESRI
• INS SINDHUGHOSH
• INS SINDHUSHSTRA
• INS SINDHURAJ
• INS SINDHUKIRTI
• INS SINDHUVIR
• INS SINDHUVIJAY
anadig systems

# వాడల వాడల వెంట

- పాలూరి కాళీప్రసాద్

అన్నమయ్య కీర్తనలలో 'వాడల వాడల వెంట వాడవో నీడ నుండి చీరలమ్మే నేత బేహారి' అనే కీర్తన చాలా బాగుంటుంది.

ఇందులో అన్నమయ్య పరమాత్మను ఒక చీరలు నేసే నేతవానిగా, ఇంకా వాటిని అమ్మే వ్యాపారిగా కీర్తిస్తారు.

పంచభూతములనే నూలుతో మన దేహాలనే చీరలు తయారు అవుతాయి. ఈ నూలు దారాలు స్థిరంగా నిలబడటానికి మాయ అనే గంజి కలిపి ఈ చీరలను నేస్తారు. ఇంకా ఆ చీరల మీద ఉండే పలు రకాల రంగు రంగుల డిజైన్ల కోసం స్వామి గుణములనే నూలును వాడతారట.

అయితే సంతలో ఆ చీరలను కొనుక్కునే జీవులకి ఒకేసారి అనేక చీరలు కొనుక్కొని బీరువాలో దాచుకునే సౌలభ్యం లేదు. తన దగ్గరున్న చీరను (దేహాన్ని) స్వామికిచ్చేసి, ఇంకా తన కర్మ అనే ధనాన్ని వెచ్చించి, దానికి అనుగుణమైన కొత్త చీరను (దేహాన్ని) స్వామి నుండి కొనుక్కోవాలి. అందుకే స్వామిని అన్నమయ్య మారు బేహారి అంటారు.

అయితే మరి స్వామి వ్యాపారం ఎప్పుడు బాగా గిట్టుబాటు అయినట్లు? ఆ ఊరిలోని జీవులందరికీ ఇక చీరలు కొనే అవసరం ఎప్పుడు కలుగకుండా పోతుందో (అంటే మళ్ళీ జన్మించాల్సిన అవసరం లేకుండా పోతుందో) అప్పుడు. అందుకే అన్నమయ్య స్వామిని నీడపట్టున (వైకుంఠంలో) కూర్చోకుండా వాడల వాడల వెంట తిరుగుతూ (గురువుల, మహాత్ముల రూపంలో మాటి మాటికీ అవతరిస్తూ) వ్యాపారం చేసుకోమని (జీవులందరినీ ఇక శరీరం ధరించే అవసరం లేని మోక్ష స్థితికి చేర్చుకోమని) సూచిస్తున్నారు.

శుభాభినందనలతో ...



VennTech
Manufacturer of
Ventilation System /
Air Handling Equipments
for Marine applications
PRODUCTS :
Blowers
ATU'S
Coolers
Moisture Separaters
Heat Exchangers
PLOT NO: 1-125/17/A, MIE, HAFEEZPET, MIYAPUR, HYDERABAD – 500 049.
MOBILE: 9000410044, TEL : 040 – 64100589, FAX:040-23116650
E-MAIL: VENNTEC@GMAIL.COM

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## భీమవరం తాతయ్యగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

ఎదురుగా తన విస్తట్లో పెద్ద గుమ్మడికాయ సైజులో తయారైన పదార్థం చూసేసరికి సగం మతి పోయిన వెంకట రత్నం, ముద్ద మీద ముద్ద శ్రీబాబు తినిపిస్తుంటే, ఉక్కిరి బిక్కిరి అవుతూ కూడ, "ఎలా వుంది?" అని శ్రీ బాబు అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పకపోతే బాగుండదని, ఎలాగో పెగుల్చుకుని "బాగుంది" అనేవాడు. "నీ మొహం! బాగుండట మేమిటి? బాగుండక చేదుగా వుంటుందా? ఎంత బాగుందో చెప్పు" అని శ్రీబాబు అంటే "బ్రహ్మాండంగా ఉంది" అనవలసిందే! ఇకదానినుండి శ్రీబాబు దివ్యబోధను అందించే వారు.



"వేడి వేడి అన్నము, వేయించిన కందిపప్పు, కొత్త ఆవగాయ యీ మూడిటిని ఆవునెయ్యితో బాగా కలిపి ముద్ద చేసి తింటేనే , యింత బ్రహాండమైన ఆనందం కలుగుతున్నది గదా! అయితే ఆనందానుభవం ఎంతసేపు ఉంటుంది? గొంతు దిగేవరకే గదా! లేదా, పోనీ జీర్ణమైపోయే వరకే గదా! తరువాత మళ్ళీ ఆకలి మొదలు.

కాని మానవుడు తనలోని సత్వ, రజో, తమో గుణాలనే త్రిగుణాలను 'ఆత్మ విచారణ' అనే ఆవు నేతితో కలిపి ఏకరూపంగా చేసి ఆరగిస్తే, త్రిగుణాతీతము, శాశ్వతము అయిన బ్రహ్మానందమే పొందగలడు. ఆ ఆనందము సంపూర్ణము, అద్వితీయము అయినది. దానినే **"ఏకో బ్రహ్మాణ ఆనంద:"** అని వేదాలు అభివర్ణిస్తున్నవి. అటువంటి బ్రహ్మానందమును అనుభవించిన వానికి యిక ఆకలి దప్పులు, సుఖ

దు:ఖములు, జనన మరణములు మొదలైన ద్వంద్వములేవీ ఉండవు. అందరిలోను, అన్నిటిలోను ఆ ఆనందమునే అతడు దర్శించ గలుగుతాడు. అందరినుండి అన్నిటి నుండి ఆ బ్రహ్మానందమునే అందుకో గలుగుతాడు. అందరికి ఆ ఆనందమునే అందించ గులుగుతాడు. అతడే మహాత్ముడు. అతడే సత్యగురువు" అని శ్రీబాబు ప్రబోధించే వారు.

తాతయ్యగారికి అస్పృశ్యత విషయంలో పట్టింపు చాల ఎక్కువగా ఉండేది. ఆ వీధిలో వెళ్ళే హరిజనులుగాని, 'పెద్ద కులం'( మాల, మాదిగ కులాలను శ్రీబాబు 'పెద్ద కులం' అనేవారు) వారుగాని, వారి వాకిటి ముందుగా వెళ్ళటానికి సాహసించేవారు కాదు.

తాతయ్యగారి పొలంలో 'మహంకాళి' అనే పేరుగల ఒక హరిజనుడు పని చేస్తూ ఉండేవాడు. అతడు ఎప్పుడైనా తాతయ్యగారితో మాట్లాడవలసి వస్తే, వాకిట్లో ఫర్లాంగు దూరంలో నిలబడి భయంతో వణికిపోతూ, చేతులు కట్టుకుని మాట్లాడవలసిందే.

ఒకరోజు తాతయ్యగారు మహంకాళికి కబురు చేశారు. అతను వచ్చేసరికి యింట్లో భక్తులందరి భోజనాలూ అయిపోయినాయి. శ్రీబాబు యింట్లోనే ఉన్నారు. తాతయ్యగారు యింకా భోజనం చేయలేదు. "ఒరే మహంకాళీ! లోపలికి రా!" అని తాతయ్యగారు మహంకాళిని హాలులో నుండి పిలిచారు. 'లోపలికా!' మహంకాళి తన చెవులను తానే నమ్మలేక పోయాడు. కదల లేదు. తాతయ్యగారు వాకిట్లోకి వచ్చి మళ్ళీ పిలిచారు. మహంకాళికి కాళ్ళల్లో వణుకు పుట్టింది. తాతయ్యగారు గమనించి, అతని దగ్గరకు వెళ్ళి అతని చేతిని తమ చేతిలోనికి తీసుకుని "భయం లేదు రా రా! నేనే పిలుస్తున్నానుగా!" అని లోనికి తీసుకుని వెళ్ళారు. తమకు వడ్డించమని, తమకు దగ్గరలోనే అతనికి కూడా విస్తరి వేసి వడ్డన చేయించి కూర్చోమన్నారు.

- సశేషం

## విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

# శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు

కావేరీ నది సమీపాన తిరుచునాపల్లిలో నెరూరు అనే గ్రామంలో ఒక దేవాలయం ఉంది. అందులోకి ప్రవేశించగానే శివలింగము, దాని వెనుక బిల్వవృక్షము, దాని ఛాయలో మృత్తిక లింగము దర్శనమిస్తాయి. ఆ పవిత్ర సన్నిధానమే జీవన్ముక్తులైన శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర స్వాముల వారి సమాధి ప్రదేశము.



సదాశివబ్రహ్మేంద్రుల వారు ఆత్మజ్ఞానులైన పూర్ణ పురుషులు. శుద్ధ పరాత్పరులు.

మోక్ష సోమసుందర అవధాని అనే బ్రాహ్మణుడు ఆంధ్రప్రాంతం నుండి కదిలి కుంభకోణం సమీపంలో స్థిరపడిపోయాడు. ఆయన గొప్ప పండితుడు. ఆయన భార్య పార్వతమ్మ. వారికి సంతానం లేదు. సంతానంకోసం భగవంతుని ప్రార్థించారు. భగవత్కృపచేత వారికి ఒక పుత్రుడు కలిగాడు. అతనికి "శివరామకృష్ణ" అని నామకరణం చేశారు.

అతను పెరిగి పెద్దవాడయ్యేకొద్దీ అతడు బాహ్యవిషయాలను పట్టించుకోకుండా ఎప్పుడూ అంతర్ముఖుడై ఉండేవాడు. ధ్యానమగ్నుడై కనిపించేవాడు. సకల శాస్త్రాలను అభ్యసించాడు. శాస్త్రాలలోని తాత్త్విక రహస్యాలను జీర్ణించుకున్నాడు. సునిశిత ప్రజ్ఞావిశేషాలతో ప్రకాశించేవాడు. శివరామకృష్ణకు యుక్తవయస్సు వచ్చింది. అతనిలో వైరాగ్యజ్వాల తీవ్రరూపం దాల్చింది. భగవంతుని పొందటానికే మానవ జన్మ వచ్చిందని, అది సన్యాస ఆశ్రమం స్వీకరించటం ద్వారా సులభసాధ్యమని, అది కూడా బ్రహ్మచర్యాశ్రమం నుండే సన్యాస ఆశ్రమం

స్వీకరించాలని అభిప్రాయపడ్డాడు. అది గ్రహించిన అతని తల్లిదండ్రులు అతనికి వివాహం చేయ నిశ్చయించారు. శివరాముడు దానికి అంగీకరించలేదు. తల్లిదండ్రులు పట్టుపట్టడంతో వివాహానికి అంగీకరించాడు. అతడికి పదిహేడేళ్ళవయస్సులో వివాహం అయింది. అతనిలోని వైరాగ్యజ్వాలను వివాహమనే తొలకరి జల్లు ఆర్పలేక పోయింది.

శివరామకృష్ణ భార్య పుష్పవతి అయింది. షడ్రసోపేతంగా పిండివంటలు చేస్తున్నారు. శివరామకృష్ణకు బాగా ఆకలివేసింది. "నాకు అన్నం త్వరగా వడ్డించమ"న్నాడు. "కొంతసేపు ఆగమ"న్నారు. "నాకు పిండివంటలు అవసరంలేదు, మామూలు భోజనం వడ్డించండి చాలు" అన్నాడు. "కొంచెం సేపు ఆగు. అక్కడే ఉండు లోపలికి రావద్దు" అని అన్నారు. ఆ అన్నది తనకు కన్యాదానం చేసిన అత్తగారు.

పరిణామ క్షణం రావాలే గాని ఒక్క మాట చాలు మనిషిని మార్చటానికి. "అక్కడే ఉండు, లోపలికి రావద్దు" అన్న మాటకు "నిజమే! నిస్సారమైన సంసార జీవనంలో ప్రవేశించవద్దు'' అని నాకు తెలియజేస్తున్నారు. నేను జ్ఞాన సముపార్జనకు ప్రయత్నించాలి అని యోచిస్తూ క్షణమైనా అక్కడ నిలవకుండా బాణంలా దూసుకుంటూ వెళ్ళి పోయాడు. బంధువులంతా వెతికారు. మిత్రులు అన్వేషించారు. ఫలితం శూన్యం.

తీవ్ర వైరాగ్యంతో బయల్దేరిన శివరామకృష్ణ సత్యాన్వేషణలో ఉన్నాడు. ఆకలైతే భిక్షకు వెళ్ళేవాడు. తన దోసిటనే బిక్షా పాత్రగా పట్టేవాడు. భగవానుని తన హృదయంలో భావించుకుని సదా ధ్యానం చేసేవాడు. తన మనోమందిరాన్ని పూజ గదిగా నిర్మించుకొని భగవానుని పూజింపసాగాడు. ఈ మానసిక పూజను "శివ మానసిక పూజ" అనే కీర్తనలో చక్కగా వ్రాశారు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL